సాక్షి నంద్యాల

మంగళవారం, 4, జూన్, 2024



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సహస్రదీపార్చన పూజలు చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.



ఆనందం ముంచెత్తి!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో తొలకరి వర్షాలు అన్నదాతలను ఆనందంలో ముంచెత్తాయి. నంద్యాల జిల్లాలో కుంభవృష్టి, కర్నూలు జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. 8లో▸



రెచ్చిపోతున్న ఇసుకాసురులు

కృష్ణానది పరివాహక ప్రాంతాల నుంచి అక్రమార్కులు అడ్డగోలుగా ఇసుక తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుపుతున్నారు. ఇసుకాసురులపై ఫిర్యాదులు వెళ్లాయి. 8లో▸

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



చెంచు గూడెంలో ర్యాలీలో పాల్గొన్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

రుద్రవరం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ చిన్నయ్య స్వామి చెంచు గూడెం వాసులకు సూచించారు. మండల పరిధిలోని కోటకొండ పంచాయతీ మజరా గ్రామమైన గూడెంలో సోమవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా ఆయన వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వ హించారు. మలేరియా, సీజనల్ వ్యాధులపై గూడెం వాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 55 ఇళ్లల్లో డీడీటీ స్ప్రే చేయించామన్నారు. గూడెంలోని మంచినీటి ట్యాంకును 15 రోజులకోసారి శుభ్రం చేయించాలని, ఆ మేరకు రికార్డుల నిర్వాహణ పాటించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో రుద్రవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి జ్యోతి, నంద్యాల ప్రోగ్రాం అధికారి కాంతారావు, జిల్లా సహాయ మలేరియా అధికారి ప్రసాదరెడ్డి, ఆళ్లగడ్డ సబ్‌యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి తదితర వైద్య సిబ్బంది ఉన్నారు.

పకడ్బందీగా ఆన్‌లైన్ మూల్యాంకనం

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రక్రియను అధ్యాపకులు పకడ్బందీగా నిర్వర్తించాలని డీవీఈఓ సునీత ఆదేశించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఇంటర్ బోర్డు చరిత్రలో తొలిసారిగా ఆన్‌లైన్ మూల్యాంకనం చేపడుతున్నట్లు వెల్లడించారు. దీనిపై ఇప్పటికే అధికారులకు వర్చువల్‌గా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. మూల్యాంకనం విధులు కేటాయించిన అధ్యాపకులు తప్పని సరిగా హాజరయ్యేలా ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రైవేటు కళాశాలల అధ్యాపకులు హాజరయ్యేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని చెప్పారు. ప్రైవేటు అధ్యాపకులు గైర్హాజరైతే గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇంటర్నెట్ సెంటర్లలో వాల్యుయేషన్ చేయకూడదన్నారు. వ్యక్తిగత ల్యాప్‌టాప్, కళాశాలలో వెబ్ కెమెరా సదుపాయం ఉన్న డెస్క్‌టాప్ కంప్యూటర్‌లో మాత్రమే జవాబు పత్రాలను ఓపెన్ చేసుకోవాలని సూచించారు. మూల్యాంకన సమయంలో సంబంధిత అధ్యాపకులు తప్ప ఇతరులు ఎవరూ కనిపించకూడదన్నారు. ఆ సమయంలో ఫొటోలు తీయకూడదని, వీడియో రికార్డు చేయకూడదని కోరారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

అందుబాటులో జొన్న, కొర్ర విత్తనాలు

నంద్యాల(సెంట్రల్): ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం(ఆర్ఏఆర్ఎస్)లో మేలైన జొన్న, కొర్ర విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు సహ సంచాలకురాలు డాక్టర్ సరళమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొర్రలో రేనాడు, మహానంది, ఎస్ఐఏ-3156 రకాలు, జొన్నలో ఎన్‌టీజే-5 విత్తనాలు అమ్మకానికి సిద్ధంగా ఉంచినట్లు ఆమె పేర్కొన్నారు. ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యే రైతులు బాగా చివికిన పశువుల ఎరువు ఎకరాకు 4 నుంచి 5 టన్నులు వేసుకుని దుక్కి చేసుకోవాలన్నారు. లేదంటే గొర్రెలు, మేకల మందను పొలాల్లో నిలిపి భూసారం పెంచుకోవాలని సూచించారు. పత్తి సాగు చేసే రైతులు వీలైనంత వరకు 150 నుంచి 160 రోజుల పంటకాలం కలిగిన స్వల్ప కాలిక విత్తన రకాలు ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఒక ప్రాంతంలోని రైతులందరూ వీలైనంత వరకు స్వల్ప వ్యవధిలో విత్తుకుంటే పురుగులు, తెగుళ్లను బాగా అరికట్టవచ్చన్నారు. జొన్న, కొర్ర విత్తనాలు కావాల్సిన రైతులు నూనెపల్లెలోని ఆర్ఏఆర్ఎస్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ప్రశాంతంగా 'ఓపెన్' సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఓపెన్ పదవ తరగతి, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయని డీఈఓ సుధాకర్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ లక్ష్మినారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 5 పరీక్ష కేంద్రాల్లో 169 మంది విద్యార్థులకు గాను 154 మంది విద్యార్థులు(91.12 శాతం) హాజరయ్యారని, 15మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఇందులో పదో తరగతి హిందీ పరీక్షకు ఆరుగురు విద్యార్థులకు గాను ఐదుగురు హాజరు కాగా ఒక విద్యార్థి గైర్హాజరయ్యారన్నారు. ఇంటర్ పరీక్షకు 163మందికి గాను 154మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా.. 14మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

టిక్..టిక్..టిక్

- మరికొన్ని గంటల్లోనే ఎన్నికల ఫలితాలు
- శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు
- ఉదయం 8 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5గంటలకు పూర్తి
- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడెంచల భద్రత
- ర్యాలీలు, వేడుకలపై నిషేధం
- మద్యం దుకాణాలతో పాటు అన్ని షాప్‌లు బంద్



ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్‌కు ఏర్పాటు చేసిన టేబుళ్లు

సాక్షి, నంద్యాల/నంద్యాల: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం మరికొన్ని గంటల్లోనే తేలనుంది. ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కాలేజీ, శాంతిరాం ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో భద్రపరిచిన ఈవీఎంలలో ఓట్లను మంగళవారం లెక్కించనున్నారు. కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా మూడెంచల భద్రత ఏర్పాటు చేశారు. జిల్లాలో ఒక పార్లమెంట్, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు గత నెల 13వ తేదీన పోలింగ్ నిర్వహించారు. మొత్తం 13,89,307 మంది ఓటర్లుండగా 11,40,432 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 5,63,838 మంది, మహిళలు 5,76,451 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 82.09 శాతం పోలింగ్ నమోదుకాగా.. అత్యధికంగా 84.79 శాతంతో నందికొట్కూరు, అత్యల్పంగా 74.90 శాతంతో నంద్యాల నిలిచింది. ఆళ్లగడ్డలో 84.06 శాతం, శ్రీశైలం 82.99 శాతం, బనగానపల్లె 84.52 శాతం, డోన్ 82.77 శాతం పోలింగ్ నమోదైంది.

తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు

ఎలక్షన్ అబ్జర్వర్ల సమక్షంలో ఉదయం ఎనిమిది గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. తర్వాత ఈవీఎంల కంట్రోల్ యూనిట్లను ఓపెన్ చేసి అభ్యర్థుల వారీగా ఓట్ల వివరాలు లెక్కిస్తారు. ఒక రౌండ్ పూర్తయిన అనంతరం ఆర్వో అనుమతితో ఆ రౌండ్ ఫలితాన్ని ప్రకటిస్తారు. ఆళ్లగడ్డలో 2712, శ్రీశైలం 2179, నందికొట్కూరు 2360, నంద్యాల 4757, బనగానపల్లె 2567, డోన్ 1981 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు

కౌంటింగ్ సజావుగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కేంద్రాలను కెమెరాల నిఘాలో ఉంచారు. కౌంటింగ్‌కు సంబంధించి మొత్తం 746 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో 221 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లు, 278 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 247 మంది మైక్రో అబ్జర్వర్లు ఉన్నారు. మంగళవారం ఉదయం 5 గంటలకు మూడో విడత ర్యాండమైజేషన్ నిర్వహించి టేబుళ్ల వారీగా కౌంటింగ్ సిబ్బందిని నియమిస్తారు. స్ట్రాంగ్ రూంల నుంచి పటిష్ట భద్రత మధ్య ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రాలకు తీసుకువస్తారు.

ఇవీ నిబంధనలు..

- కౌంటింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఎవరైనా ఏజెంట్ అనుచితంగా ప్రవర్తించినా, నిబంధనలు పాటించకపోయినా బయటకు పంపించే అధికారం రిటర్నింగ్ అధికారికి ఉంటుంది.
- కౌంటింగ్ హాలుకు వందమీటర్ల పరిధిలో మార్కింగ్ చేస్తారు. దీనిని పెడెస్ట్రియన్(పాదచారుల) జోన్ అంటారు. దీని చుట్టూ బారికేడ్లు నిర్మిస్తారు. ఒక ప్రవేశ ద్వారం ఉంటుంది. ఇక్కడ స్థానిక పోలీసులను నియమిస్తారు. కౌంటింగ్ హాలుకు వంద మీటర్ల అవతలే వాహనాలను నిలిపివేస్తారు.
- స్ట్రాంగ్ రూము నుంచి కౌంటింగ్ హాలు దూరంగా ఉన్నప్పుడు ఈవీఎంలు తీసుకుని వెళ్లడానికి అసౌకర్యంగా ఉంటుంది. దీంతో స్ట్రాంగ్ రూము డోర్ వద్ద నుంచి కౌంటింగ్ హాలు వరకూ ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు.
- ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూము భవనాల ప్రవేశ ద్వారం నుంచి కౌంటింగ్ హాళ్ల వరకూ ఉన్న ప్రదేశాన్ని రెండో అంచెగా పరిగణిస్తారు. ఇక్కడ తగినంత మంది రాష్ట్ర సాయుధ పోలీసులు ఉంటారు.
- ఆడియో, వీడియో రికార్డు చేయగల మొబైల్ ఫోన్లు, ఐప్యాడ్లు, ల్యాప్‌టాబ్‌లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను లోపలకు అనుమతించరు.
- అగ్గిపెట్టె, ఇంకు పెన్నులు, బ్లేడ్లు, చాకులు, పిన్నులు, ఆయుధాలను కూడా అనుమతించరు. పెన్సిల్, తెల్లకాగితాలు తీసుకుని వెళ్లవచ్చు.
- రెండో అంచెలో రాష్ట్ర పోలీసులు మాత్రమే తనిఖీలు చేస్తారు.
- కౌంటింగ్ ఏజెంట్లు, సిబ్బంది లోపలకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రవేశం ఏర్పాటు చేస్తారు.
- కౌంటింగ్ కేంద్రం ద్వారం నుంచి మూడో అంచె భద్రత ప్రారంభమవుతుంది. ఇక్కడ సీఆర్పీఎఫ్ సిబ్బంది ఉంటారు. రిటర్నింగ్ అధికారి పిలిస్తే తప్ప కౌంటింగ్ హాలులోకి ప్రవేశించరాదు.
- ఏజెంట్లు తమకు కేటాయించిన టేబుల్ వద్ద మాత్రమే కూర్చోవాలి. కౌంటింగ్ హాల్ అంతా తిరిగేందుకు వారికి అనుమతి ఉండదు.

కౌంటింగ్ నేపథ్యంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. ఒక ఏఎస్పీ, నలుగురు డీఎస్పీలు 23 మంది సీఐలు, 38 మందిఎస్ఐలు, 92మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 174 మంది కానిస్టేబుళ్లు, 159 మంది హోంగార్డ్స్ విధుల్లో ఉండనున్నారు. వీరితో పాటు రెండు కంపెనీల కేంద్ర బలగాలు, కేరళకు చెందిన ఏఆర్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. కౌంటింగ్ రోజున ఎలాంటి కారణం లేకుండా బయటి వ్యక్తులు నంద్యాల పట్టణంలోని లాడ్జీలు, హోటళ్లలో ఉండకూడదని ఆదేశాలు జారీ చేశారు.

ఐడీ కార్డులుంటేనే అనుమతి

అభ్యర్థులు సిఫార్సు చేసిన వారికి ఎన్నికల అధికారులు గుర్తింపు కార్డులను జారీ చేశారు. ఒక్కో టేబుల్‌కు ఒకరు చొప్పున వీటిని కేటాయించారు. ఈ కార్డులున్న వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పెన్ను, పేపర్ తప్పించి ఇతర ఏ వస్తువులు ఉ న్నా వాటిని కౌంటింగ్ హాల్‌లోనికి అనుమతించరు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద సూపర్ వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు, అధికారులకు ప్రత్యేకంగా ఎంట్రన్స్ ఏర్పాటు చేశారు. ప్రతి రౌండ్ ముగిసిన వెంటనే మీడియా సెంటర్ ద్వారా ఫలితాలను విడుదల చేస్తారు.



కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్లు

మధ్యాహ్నానికి తెలిసిపోనున్న ట్రెండ్

ఓట్ల లెక్కింపునకు సంబంధించి రౌండ్ల వారీగా వివరాలను రిజల్ట్స్.ఈసీఐ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో, వోటర్ హెల్ప్‌లైన్ యాప్‌లోనూ ఎలక్షన్ ట్రెండ్స్ టీవీలో తెలుసుకోవచ్చు. కౌంటింగ్ నాలుగైదు రౌండ్లు ముగిసే సరికి ఫలితంపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మధ్యాహ్నం 12 గంటలకు ట్రెండ్ ఎలా ఉందో తెలిసిపోనుంది. జిల్లా పరిధిలో మంగళవారం విజయోత్సవ ర్యాలీలు, వేడుకలకు అనుమతి లేదు. ఎన్నికల ఫలితాల అనంతరం గెలిచిన అభ్యర్థులు ఎవరూ బాణసంచా కాల్చడం, డీజే వినియోగం, ర్యాలీలు తీస్తే చట్టపరంగా చర్యలు తీసుకోనున్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంది. అలాగే కౌంటింగ్ సందర్భంగా మద్యం దుకాణాలను మూసివేశారు.

ఈవీఎంలు మొరాయిస్తే...?

ఓట్ల లెక్కింపు సమయంలో టేబుళ్ల వద్ద ఏదైనా ఈవీఎం మొరాయిస్తే సమస్యను పరిష్కరించేందుకు ఐటీ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అయినా పరిష్కారం కాకపోతే ఆ ఈవీఎంను అలాగే పెట్టి అన్ని రౌండ్లు ముగిసిన తర్వాత ఆ ఈవీఎంకు సంబంధించిన వీవీప్యాట్లను ఓపెన్ చేసి గుర్తుల వారీగా ఓట్లను లెక్కించి ఫలితాలు ప్రకటించనున్నారు.

సాయంత్రం 5గంటలకు ఫలితాలు పూర్తి

నంద్యాల జిల్లాలోని పార్లమెంట్, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ఉదయం 8గంటలకు ప్రారంభం కానుంది. మొదటగా ఈవీఎంల లెక్కింపు తొలి రౌండ్‌కు అరగంట సమయం పడుతుంది. రెండో రౌండ్ నుంచి 20నిమిషాలు మాత్రమే తీసుకుంటుంది. ఈ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు సాయంత్రం 5గంటలకల్లా పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మరో అరగంట పాటు వీవీప్యాడ్ స్లిప్పులను ర్యాండమ్‌గా లెక్కిస్తారు. గెలుపొందిన అభ్యర్థులకు సాయంత్రం 6గంటలకు డిక్లరేషన్ అందజేస్తారు.

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	కౌంటింగ్ రౌండ్లు
ఆళ్లగడ్డ	2,32,676	1,95,582	19
శ్రీశైలం	1,96,116	1,62,760	17
నందికొట్కూరు	2,18,047	1,84,892	18
నంద్యాల	2,73,938	2,05,190	21
బనగానపల్లె	2,41,179	2,03,839	20
డోన్	2,27,351	1,88,169	21

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు

ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఓట్ల లెక్కింపు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుందన్నారు. పోస్ట్ ద్వారా వచ్చి కలెక్టరేట్‌లో స్టోరేజ్ చేసిన సర్వీస్ ఓటర్ల ఈటీపీబీఎస్ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను మంగళవారం ఉదయం 5 గంటలకు ఆర్జీఎంలోని ఓట్ల లెక్కింపు కేంద్రానికి తీసుకెళ్తామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరుకావాలన్నారు.

746 మంది కౌంటింగ్ సిబ్బంది కేటాయింపు

రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా 746 మంది కౌంటింగ్ సిబ్బందిని ఆరు నియోజకవర్గాలకు కేటాయించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించడానికి ఎలక్షన్ కమిషన్ ద్వారా జిల్లాకు కేటాయించబడిన అబ్జర్వర్ల సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, అబ్జర్వర్లు దినేష్ కుమార్, భగవత్ కిశోర్‌మిశ్రా, అభిజిత్ ముఖర్జీ, రాహుల్ సింగ్, వేద్ ప్రకాష్ మిశ్రా, అమిత్ కుమార్ పాల్గొన్నారు.



రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

ఓడేదెవరో.. నిలిచేదెవరో?

- గెలుపు అంచనాల్లో తలమునకలైన నేతలు

ఈవీఎంలలో నిక్షిప్తమైన ఫలితాలు ఎవరికి అనుకూలంగా ఉన్నాయోనన్న ఆసక్తి జిల్లా ప్రజల్లో నెలకొంది. జూన్ 1వ తేదీ సాయంత్రం వెలువడిన ఎగ్జిట్ ఫలితాల్లో అధిక శాతం మళ్లీ ఫ్యాన్‌కే అధికారం దక్కనుందని కుండబద్దలు కొట్టేశాయి. పోలింగ్ ముగిసిన తర్వాత ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులు పోలింగ్ కేంద్రాల వారీగా తమకు పడే ఓట్లు ఎన్నో లెక్కేసుకుని ఓ అంచనాకు వచ్చారు. అయితే అభ్యర్థుల అంచనాలు నిజమవనున్నాయో.. తలకిందులవుతాయో నేడు తేలనుంది. 2014 ఎన్నికల్లో బనగానపల్లె మినహా అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచారు. 2019లో వైఎస్సార్ సీపీ క్లీన్ స్వీప్ చేసింది. ఇవే ఫలితాలు ఈ ఎన్నికల్లోనూ పునరావృతమవుతాయని అధికార పార్టీ అభ్యర్థులు ధీమాగా ఉన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లే కీలకం

ఈ దఫా ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ప్రతిపక్ష టీడీపీ కుటిల రాజకీయాలకు తెరలేపింది. దీంతో కౌంటింగ్ సమయంలో ఏజెంట్లు కీలకంగా వ్యవహరించాల్సి ఉంది. ఏ మాత్రం అనుమానం వచ్చినా సంబంధిత రిటర్నింగ్ అధికారిని అప్రమత్తం చేయాలి. కౌంటింగ్ సిబ్బంది ఏదైనా పొరపాటుగా లెక్కించినా రీ కౌంటింగ్ నిర్వహించేలా చూడాలి. ఏజెంట్లు ఒకసారి కౌంటింగ్ హాల్‌లోకి ప్రవేశించాక లెక్కింపు పూర్తయ్యే వరకు బయటికి రావడానికి వీల్లేదు.

స్థానికంగా, జాతీయంగా పేరున్న సర్వే సంస్థలన్నీ రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి వస్తుందని చెప్పేశాయి. జిల్లాకు సంబంధించి ఆళ్లగడ్డలో వైఎస్సార్‌సీపీ నుంచి గంగుల బిజేంద్రారెడ్డి టీడీపీ నుంచి భూమా అఖిలప్రియ నువ్వా నేనా అన్నట్లు పోటీ పడ్డారు. అయితే ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రభావం నియోజకవర్గ ప్రజలపై అధికంగా ఉండడంతో గంగుల బిజేంద్రారెడ్డి రెండో సారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యే అవకాశం ఉందని సర్వే సంస్థలు అంచనా వేశాయి. బనగానపల్లెలో కాటసాని రామిరెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి హోరాహోరీగా తలపడ్డారు. ఇక్కడ టీడీపీ అభ్యర్థి బీసీ డబ్బులను కుమ్మరించారు. అయినా ఓటర్లు రామిరెడ్డికే జై

ఎగ్జిట్ పోల్స్ అన్నీ వైఎస్సార్‌సీపీకే జై

కొట్టినట్లు సర్వేలలో వెల్లడైంది. నంద్యాలలో శిల్పా రవి, ఎస్ఎండీ ఫరూక్ పోటీ పడగా వార్ వన్ సైడ్ జరిగినట్లు సర్వే సంస్థలు అంచనా వేశాయి. శిల్పా రవి మంచి మెజారిటీతో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. శ్రీశైలానికి సంబంధించి శిల్పా చక్రపాణి రెడ్డి, బుడ్డా రాజశేఖరరెడ్డి తలపడగా విజయం శిల్పా చక్రపాణిని వరించనున్నట్లు సర్వే సంస్థలు అంచనా వేశాయి. బుడ్డాను గెలిపిస్తే డబ్బుల కోసం పార్టీ మారిన విషయాన్ని నేటికి నియోజకవర్గ ప్రజలు మరిచిపోలేదని తెలుస్తోంది. డోన్‌లో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ముచ్చటగా మూడో సారి విజయఢంకా మోగించనున్నారు. నందికొట్కూరులోనూ వార్ వన్ సైడ్ అయినట్లు సర్వేలు అంచనా వేశాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్ మొదటి సారి మంచి మెజారిటీతో గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టనున్నట్లు సర్వేలు తేల్చి చెబుతున్నాయి. పాణ్యంలో కాటసాని రాంభూపాల్ రెడ్డి, గౌరు చరితారెడ్డి మధ్య పోరు హోరాహోరీగా సాగింది. ఇక్కడ టఫ్ ఫైట్ నడిచినట్లు సర్వేలు చెబుతున్నాయి. అయితే విజయావకాశాలు మాత్రం కాటసాని రాంభూపాల్ రెడ్డికే ఉన్నాయని మెజారిటీ సర్వేలు తెలిపాయి.



మల్లన్న దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

శ్రీగిరికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. సోమవారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు మల్లన్నకు గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సర్వ దర్శనానికి 3 గంటలు, శీఘ్ర దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. ఉచిత కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్న భక్తులకు దేవస్థానం సిబ్బంది తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు పంపిణీ చేశారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.



భ్రమరాంబాదేవి అమ్మవారి దర్శనానికి వెళ్తున్న భక్తులు

మన బడికి రండి!

- తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు
- ఇంటింటి ప్రచారం

నంద్యాల(న్యూటౌన్): పేదింటి ప్రతి విద్యార్థి చదువుకోవాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. ఆ లక్ష్యంతోనే పిల్లలను బడికి పంపితే చాలు ప్రభుత్వమే వారి చదువుకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలను ఉచితంగా అందిస్తోంది. దీంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేటు ధీటుగా అధునికీకరించి ఆంగ్లమాధ్యమం, సీబీఎస్‌ఈ సిలబస్‌ని కూడా అమలు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా పాఠశాలలు పునః ప్రారంభం రోజునే పిల్లలందరికీ విద్యాకానుకను అందించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలపై ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతిలో సాధించిన ఫలితాలను, ప్రభుత్వం కల్పించిన వసతుల గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. కొంతమంది ప్రధానోపాధ్యాయులు ప్రైవేటు పాఠశాలల తరహాలో ఈ ఏడాది పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల ఫొటోలతో కరపత్రాలను ముద్రించి తల్లిదండ్రులకు అందచేస్తూ ప్రచారం సాగిస్తున్నారు.

- పిల్లలకు రోజుకో మెనూతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. అలాగే చిక్కీలు, రాగి జావలను కూడా ఇస్తున్నారు. దీంతో పాటు పిల్లలను బడికి పంపే తల్లుల ఖాతాలో ఏడాదికి రూ.15 వేలు నగదు జమకానుందని తెలియజేస్తున్నారు. పైసా ఖర్చు లేకుండా సొంత ఊరి బడిలోనే పిల్లలకు ఉత్తమ విద్యను పొందవచ్చని చెబుతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు స్మార్ట్ టీవీలతో బోధన, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్లను ఉచితంగా ఇస్తున్నారని చెబుతున్నారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా బోధన అందు తుందని పిల్లల తల్లితండ్రులకు వివరిస్తున్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

హైస్కూల్ ప్లస్ బడుల గురించి ప్రచారం..

గ్రామీణ ప్రాంతాల్లో పదోతరగతి తర్వాత తమ పిల్లలను ఇంటర్‌లో చేర్పించడానికి చాలామంది వెనుకంజ వేస్తున్నారు. దీంతో చాలామంది బడికి దూరమవుతూ డ్రాపౌట్స్‌గా మారుతున్నారు. దీనిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఉన్న ఊరిలోని ఉన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి హైస్కూల్ ప్లస్‌గా మారుస్తోంది. ఇందులో భాగం గా 2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని 7 ఉన్నత పాఠశాలలను హైస్కూల్ ప్లస్ మార్చింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో డ్రాపౌట్స్ సంఖ్య తగ్గనుంది. హైస్కూల్ ప్లస్ గురించి కూడా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

పది అంశాల గురించి వివరిస్తూ...

'మనబడి'కి రండి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రచారం సాగిస్తున్నారు. ఉపాధ్యాయులు ముఖ్యంగా పది అంశాల గురించి పిల్లల తల్లితండ్రులకు తెలియచే స్తున్నారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలలు ఎలా తయారయ్యాయో తెలియజేస్తున్నారు. అలాగే ఆంగ్ల మాధ్యమం అందుబాటులో ఉందని, నూతన విద్యా విధానం ద్వారా పిల్లలకు ఒత్తిడిలేని బోధన ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్స్ ఉంటారని, పిల్లల చదువుకు కావాల్సిన అన్ని రకాల వస్తువులను విద్యాకానుక పేరుతో ఉచితంగా అందజేస్తారని వివరిస్తున్నారు. విద్యాకానుకలో పిల్లలకు అవసరమైన యూనిఫాం, బూట్లు, సాక్సులు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగులు ఇస్తారని చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తే తల్లిదండ్రులకు భారం ఉండదని చెబుతూ ప్రచారం సాగిస్తున్నారు.



సర్వాంగ సుందరంగా మారిన ప్రభుత్వ పాఠశాల



అన్ని వసతులతో తరగతి గది

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతోపాటు ఉన్నత విలువలు, సంస్కారం, సంప్రదాయాల గురించి కూడా నేర్పుతున్నారు. ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తున్నారు. దీంతో కార్పొరేట్‌కు ధీటుగా ఫలితాలు కూడా వస్తున్నాయి. తల్లితండ్రులు ఆలోచించి రూపాయి ఖర్చు లేకుండా అన్ని వసతులు కల్పించే ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలి.

-సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల


హాలహర్వి: చింతకుంట-బళ్లారి రహదారిలో వంక పొంగిపొర్లి స్తంభించిన రాకపోకలు


హొళగుంద: మార్లమడికి వద్ద పొంగి ప్రవహిస్తున్న వేదావతి నది


హాలహర్వి: పత్తి విత్తనాలను విత్తుతున్న కూలీలు


కోవెలకుంట్ల: అమడాల సమీపంలో జుర్రేరు వాగులో వరద ఉధృతి


కోవెలకుంట్ల- లింగాల ఆర్అండ్‌బీ రహదారిలో ఉప్పొంగి ప్రవహిస్తున్న నల్లవాగు

ఆనందం ముంచెత్తి!

ఖరీఫ్ ఆరంభంలోనే భారీ వర్షాలు

- సీమ జిల్లాల్లోకి విస్తరించిన రుతుపవనాలు
- సోమవారం ఉదయం తెల్లవారుజాము నుంచి ఏకధాటి వర్షం
- బనగానపల్లి, పాణ్యం, శ్రీశైలంలో కుండపోత
- ఎమ్మిగనూరు, కర్నూలు అర్బన్, కల్లూరులో భారీ వర్షాలు


శ్రీశైలం టెంపుల్: ఆలయ క్యూ కాంప్లెక్స్‌లోకి చేరిన వర్షపు నీరు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో తొలకరి వర్షాలు అన్నదాతలను ఆనందంలో ముంచెత్తాయి. నైరుతి రుతుపవనాలు సకాలంలో రాష్ట్రంలోకి ప్రవేశించడం, వెంటనే రాయలసీమ జిల్లాల్లోకి విస్తరించడంతో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. సోమవారం ఉదయం 3.50–4గంటల మధ్య మొదలైన వర్షాలు 8.30 గంటల వరకు కురిశాయి. ఉరుములు, మెరుపులతో నంద్యాల జిల్లాలో కుంభవృష్టి, కర్నూలు జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన మూడవ రోజునే తొలకరి రెండు జిల్లాలను పలకరించింది. తొలకరి వర్షాలు ఆశాజనకంగా పడటంతో కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ప్రధానంగా పత్తి విత్తనం నాటుకునే పనులు పెద్ద ఎత్తున చేపట్టారు. నంద్యాల జిల్లాలో ప్రధానంగా డోన్ నియోజకవర్గం వర్షాధారంపై ఆధారపడింది. తొలకరి వర్షాలతో డోన్ నియోజకవర్గంలో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి.

మూడు రోజుల్లోనే 34.5 మి.మీ

కర్నూలు జిల్లా పూర్తిగా వర్షాధారంపై ఆధారపడి ఉంది. ఖరీఫ్ ఆరంభంలోనే పదునైన వర్షాలు రైతులను ఆనందంలో ముంచెత్తాయి. అత్యధికంగా ఎమ్మిగనూరులో 69.2 మి.మీ, అత్యల్పంగా కోసిగిలో 8.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఒక్కరోజులోనే జిల్లా మొత్తంగా సగటున 33.4 మి.మీ వర్షం కురిసింది. జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 మి.మీ ఉండగా మూడు రోజుల్లోనే 34.5 మి.మీ వర్షపాతం నమోదు కావడం విశేషం. రుతు పవనాలు చురుగ్గా ఉండటంతో రానున్న రోజుల్లో వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉన్నట్లు స్పష్టమవుతోంది.

ఖరీఫ్ ఆరంభంలోనే కుంభవృష్టి

ఖరీఫ్ మొదలైన మూడవ రోజునే నంద్యాల జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. బనగానపల్లిలో అత్యధికంగా 178.8 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా గడివేములలో 10.4 మి.మీ వర్షం కురిసింది. నంద్యాల జిల్లా జూన్ నెల సాధారణ వర్షపాతం 76.8 మి.మీ ఉండగా ఒక్కరోజులోనే 56.7 మి.మీ వర్షం కురిసింది. భారీ నుంచి కుంభవృష్టి వర్షాలు పడటంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ప్రధాన రహదారులు జలమయం కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

బ్లాక్‌లో బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు

మే నెలలో అకాల వర్షాలు జోరుగా కురిశాయి. ఈ నేపథ్యంలో రైతులు భూములను సిద్ధం చేసుకున్నారు. దీంతో ఒక్కసారిగా బీటీ-2 పత్తి విత్తనాలకు డిమాండ్ ఏర్పడటంతో కొన్ని కంపెనీలు కృత్రిమ కొరత సృష్టిస్తున్నాయి. ఇదే సమయంలో బ్లాక్‌లో విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారు. ఎంఆర్‌పీ రూ.864 ఉండగా ఎక్కడా ఈ ధరకు విక్రయిస్తున్న దాఖలాలు లేవు. కృత్రిమ కొరత సృష్టించి ప్యాకెట్‌ను రూ.1.200 నుంచి రూ.1.400 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

వేరుశనగకు పెరిగిన డిమాండ్

ఈ సారి కే-6తో పాటు జిల్లాకు కొత్త రకాలను కూడా కేటాయించడం విశేషం. జిల్లాకు 13,929 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించగా ఇందులో కే-6 రకం 11,500 క్వింటాళ్లు ఉంది. కొత్తగా టీసీజీఎస్ 1694 రకం, కదిరి లేపాక్షి రకం వేరుశనగను కేటాయించారు. ఈ రకాలు ఏపీసీడ్స్‌లో సిద్ధంగా లేవు. అనంతపురం నుంచి రావాల్సి ఉంది. అదనపు వేరుశనగ కోసం ప్రతిపాదనలు పంపినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడం గమనార్హం.


దొర్నిపాడు: క్రిష్టిపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

ఉమ్మడి జిల్లాల వర్షపాత వివరాలు

మండలం	వర్షపాతం
పాణ్యం	153.6
శ్రీశైలం	144.8
ఆత్మకూరు	84.2
నందికొట్కూరు	80.2
జూపాడుబంగ్లా	77.4
కొలిమిగుండ్ల	75.4
కర్నూలు అర్బన్	67.4
అవుకు	66.2
కల్లూరు	65.6
హాలహర్వి	64.6
కొత్తపల్లి	64.6
దొర్నిపాడు	63.2
పాములపాడు	58.2
కోవెలకుంట్ల	57.4
మిడుతూరు	54.2
కర్నూలు రూరల్	51.2
గోస్పాడు	50.6


బేతంచెర్ల: హెచ్ కొట్టాల గ్రామం వద్ద పొలంలో నిలిచిన వర్షపు నీరు


గూడూరు: పెంచికలపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వక్కెర వాగు


నందికొట్కూరు: వర్షపు నీటితో నిండిన ప్రభుత్వ వైద్యశాల ఆవరణ


కల్లూరు: బస్తిపాడులో పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

6,7 తేదీల్లో బస్సు పాసుల జారీ నిలిపివేత

నంద్యాల టౌన్: బస్సు పాసులు ఇవ్వడానికి కొత్త సాఫ్ట్ వేర్ ఏర్పాటు చేస్తున్నందున ఈ నెల 6,7 తేదీల్లో నంద్యాల ఆర్టీసీ డిపో పరిధిలోని గ్రామాల విద్యార్థులకు, సీజనల్ టికెట్ తీసుకొనే ప్రయాణికులకు ఎలాంటి బస్ పాసులు మంజూరు చేయలేమ ని డిపో మేనేజర్ గంగాధర్ సోమవారం ఒక ప్రకట నలో తెలిపారు.8వ తేది నుంచి యథావిధిగా బస్సు పాసులు మంజూరు చేస్తామని విద్యార్థులు, ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

రెచ్చిపోతున్న ఇసుకాసురులు


శాతనకోట ఏరియాలోని కృష్ణానది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు


కృష్ణానదిలో ట్రాక్టర్‌కు ఇసుక వేసిన దృశ్యం

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

నందికొట్కూరు: ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని కృష్ణానదీ పరివాహక ప్రాంతాల నుంచి అడ్డగోలుగా ఇసుక తరలిస్తున్నారు. అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. పూడూరు, రాళ్లంపాడు, శాతనకోట, మల్యాల, బిజినవేముల గ్రామాల పొలిమేరలో ఉన్న కృష్ణానది నుంచి ఇసుకను అక్రమార్కులు సరిహద్దులు దాటిస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారుల పేరు చెప్పి హోంగార్డులు అడ్డదిడ్డంగా ఇసుకను తవ్వేస్తున్నారని మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో టిప్పర్లను, ట్రాక్టర్లను సీజ్ చేశారు. శాతనకోట ప్రాంతం నుంచి ప్రతి రోజూ రాత్రి 50 ట్రాక్టర్ల ఇసుక తరలిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్ లోడింగ్ ఖర్చు రు. 1000 నుంచి రు. 1500 వరకూ ఉంటుంది. నందికొట్కూరులోనే ట్రాక్టర్ ఇసుకను రూ. 7వేలపై గానే విక్రయిస్తున్నారు. పాములపాడు, ఆత్మకూరు ప్రాంతాల్లో రూ, 9 వేల వరకు అమ్ముతున్నారు. ఒక ట్రాక్టరు నుంచి రూ. 3500 నుంచి రూ. 6500 వరకూ ఆదాయం వస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులకు నెలకు ఒక ట్రాక్టర్‌కు రూ. 5000 చొప్పున మూమూళ్లు ఇస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. పోలీసుల అండతో హోంగార్డు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అక్రమంగా ఇసుకను తరలించడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగునీటి కష్టాలు తలెత్తుతాయని ప్రజలు చెబుతున్నారు. కేసీ కెనాల్ వెంట వెళ్తున్న ట్రాక్టర్ల కారణంగా ఇటీవల వేసిన రోడ్డు దెబ్బతింటున్నాయని లష్కర్లు ఒక్కొక్క ట్రాక్టరు నుంచి రూ. 300 వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజల ఫిర్యాదు మేరకు మైనింగ్ అధికారుల ఆదేశాల మేరకు టిప్పర్లను, జేసీబీని రూరల్ సీఐ విజయ భాస్కర్ ఆధ్వర్యంలో పోలీసులు సీజ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రం స్పందించి ఇసుకాసురులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను, జేసీబీని సీజ్ చేసిన మైనింగ్ శాఖ అధికారులు, పోలీసులు

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌లో మార్పు

కర్నూలు సిటీ: పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌లో అధికారులు మార్పులు చేశారు. సాధారణ ఎన్నిక ల కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమలు లో ఉన్నందున కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మా ర్పులు చేశారు.గత నెల 24 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించేందుకు ఇచ్చిన గడువులో మార్పు చేయలేదు. ఫీజు చెల్లించిన విద్యార్థుల విద్యార్హత ధ్రువ పత్రాల పరిశీలన సోమవారంతో ముగియాల్సి ఉంది. అయితే కౌంటింగ్ నేపథ్యంలో ఈ నెల 6వ తేదీకి మార్పు చేశారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తి అయిన వారికి గత నెల 31 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు కాలేజీ ఆప్షన్స్ ఇచ్చుకునే అవకాశం ఉండేది. దీన్ని ఈ నెల 7, 8, 9, 10 తేదీలకు మార్పు చేశారు. ఆప్షన్ మార్చుకునే అ వకాశం ఈ నెల 5వ తేదీ వరకు ఉండగా, దీన్ని ఈ నెల 11వ తేదీకి మార్చారు. ఆప్షన్ ఇచ్చుకున్న వారికి ఈ నెల 7వ తేదీన కాలేజీలను కేటాయించాల్సి ఉండగా..11వ తేదీకి మార్చా రు. సీట్లు పొందిన వారు ఈ నెల 14 నుంచి 19వ తేదీలోపు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్ట్ చేసుకోవాలి. ఈ నెల 14వ తేదీ నుంచే పాలిటెక్నిక్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

శ్రీశైలంలో ‘బేబీ’


హీరోయిన్ వైష్ణవి చైతన్య

శ్రీశైలం టెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను బేబీ సినిమా హీరోయిన్ వైష్ణవి చైతన్య దర్శించుకున్నారు. సోమవారం శ్రీశైలానికి చేరుకున్న ఆమె ఆలయంలో శ్రీ మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. హీరోయిన్‌తో ఫోటోలు దిగేందుకు భక్తులు, స్థానికులు ఆసక్తి చూపారు.

ఈవీఎంల భద్రతపై విద్యుత్ శాఖ జేఈ నిర్లక్ష్యం

- సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఎస్ఈ


సస్పెన్షన్‌కు గురైన కృష్ణారెడ్డి


విచారణ జరుపుతున్న ఎస్ఈ ఉమాపతి

కర్నూలు(అగ్రికల్చర్): ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన రాయలసీమ యూనివర్సిటీలో ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో విధులు నిర్వహిస్తున్నారు. అయితే విద్యుత్ శాఖకు చెందిన జూనియర్ ఇంజినీర్ కృష్ణారెడ్డి మాత్రం విధులంటే లెక్కలేనట్లుగా వ్యవహరించారు. దీంతో ఆయనను సస్పెండ్ చేస్తూ విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం సాయంత్రం నుంచి గాలులు, ఉరుములు ఉన్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ఒక్క నిముషం కూడా జాప్యం లేకుండా పునరుద్ధరించాలి. అయితే ఆదివారం రాత్రి 10 గంటలకు విధులకు వెళ్లి జేఈ కృష్ణారెడ్డి పది నిమిషాలు కూడా అక్కడ ఉండకుండా వెళ్లిపోయారు. రాత్రి భారీ వర్షం కురిసినప్పటికీ పత్తా లేకుండా పోయారు. ఉదయం తనిఖీలకు వెళ్లిన ఎస్ఈ ఉమాపతి ఈ విషయాన్ని తెలుసుకుని జేఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గాలి, వాన, ఉరుములు, మెరుపుల మధ్య విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే బాధ్యులెవరని మండిపడ్డారు. జేఈని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ వేటు పడిన జేఈ కృష్ణారెడ్డి డిస్ట్రిబ్యూషన్-2 సబ్ డివిజన్ ఏడీఈ రాజేంద్రప్రసాద్ కంట్రోల్‌లో పనిచేస్తున్నారు. ఈయనపై పలు అవినీతి ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది.

20 పడకలతో క్యాజువాలిటీ విస్తరణ


క్యాజువాలిటీలో వైద్యులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): క్యాజువాలిటీ విభాగాన్ని 20 పడకలతో మరమ్మతులు చేసి విస్తరించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆసుపత్రిలోని న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్, రేడియాలజీ, పెథాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, క్యాజువాలిటీ, ఔషధశాల, ఇంజెక్షన్ రూమ్, ఇతర విభాగాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఏఎంసీని సైతం త్వరలో విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలోని మినిస్టీరియల్ సిబ్బంది అందరూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సీఎస్ఆర్ఎంవో, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో, ఏఆర్ఎంవోలు, మెడికల్ ఆఫీసర్(స్టోర్), అసిస్టెంట్ ప్రొఫెసర్లు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండాలన్నారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, ఏఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ ఇన్‌ఛార్జి డాక్టర్ సునీల్ ప్రశాంత్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ డాక్టర్ శివబాల నాగాంజన్ ఉన్నారు.

ల్యాబ్‌టెక్నీషియన్లు విధిగా అన్ని పరీక్షలు చేయాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ల్యాబ్‌టెక్నీషియన్లు అవసరమైన అన్ని రకాల పరీక్షలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజి ఓల్డ్ లెక్చర్ గ్యాలరీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో పనిచేస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్లు మలేరియా, డెంగీ, క్షయ, ఇతర వ్యాధినిర్ధారణ పరీక్షలు క్వాలిటేటివ్‌గా నిర్వహించాలని, పాజిటివ్ కేసులను వైద్యాధికారితో సంప్రదించి వీలైనంత త్వరగా చికిత్సలు అందేటట్లు చూడాలని తెలిపారు. అంతేగాక రికార్డులు, రిపోర్టులు సక్రమంగా నిర్వహించి ఆ వివరాలను అదే రోజు సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి నూకరాజు, డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, ఏఎంఓ చంద్రశేఖర్, ల్యాబ్‌టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు చేరిన పులికనుమ నీరు

- పట్టణ వాసులకు తప్పిన మంచినీటి ఎద్దడి ముప్పు


ఎమ్మిగనూరుకు చేరిన నీటిని పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా మునిసిపల్ అధికారులు పులికనుమ రిజర్వాయర్ నుంచి ఎల్లెల్సీకి మళ్లించిన 170 క్యూసెక్కుల నీరు కాలువ ద్వారా ఎమ్మిగనూరుకు చేరింది. దీంతో పట్టణవాసులకు తాగునీటి సమస్య తప్పనుంది. ప్రస్తుతం పట్టణానికి మంచినీరు అందించే గుడికల్ చెరువు, ఎస్ఎస్ ట్యాంక్‌లలో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. ప్రత్యామ్నాయంగా అధికారులు ఎస్ఎస్ ట్యాంక్ ఫిల్టర్ బెడ్ల సమీప వ్యవసాయ బోర్ల ద్వారా నీటి పంపింగ్ ప్రక్రియ చేపట్టారు. ఈ క్రమంలోనే మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ మనోహర్ రెడ్డి ఇటీవల పులికనుమ రిజర్వాయర్‌ను పరిశీలించారు. అందులో ఉన్న నీటిని ఎల్లెల్సీ ద్వారా 170 క్యూసెక్కులు మళ్లించారు. రెండు రోజుల క్రితం మళ్లించిన ఈ నీరు ఆదివారం కాలువా ద్వారా పట్టణ పరిధిలోకి చేరింది. మంగళవారం నాటికి గుడికల్ చెరువుతో పాటు ఎస్ఎస్ ట్యాంక్‌లు పూర్తిస్థాయిలో నిండనున్నాయి. సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎల్లెల్సీలో ప్రవహిస్తున్న నీటిని, గుడికల్ చెరువును పరిశీలించారు. ప్రస్తుతం నిలువ చేసే నీరు దాదాపు 25 రోజులకు పైగా పట్టణంలో నీటి సరఫరాకు ఉపయోగపడనుందని మునిసిపల్ అధికారులు తెలిపారు. వర్షాలు కురిసి తుంగభద్ర డ్యాం నిండిన తర్వాత అక్కడి నుంచి నీటి విడుదల జరుగుతుందని, అప్పటి వరకు పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట ఏఈ శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనుల పరిశీలన: పట్టణంలోని ఆదోని రోడ్డులో ఉన్న అన్నమయ్య సర్కిల్‌లో చేపట్టిన సుందరీకరణ పనులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సోమవారం పరిశీలించారు. సర్కిల్‌లో చేపట్టిన ‘ఐ లవ్ యూ ఎమ్మిగనూరు’ విద్యుత్ సుందరీకరణ పనులతో పాటు సర్కిల్‌లో మొక్కలు, పచ్చదనం పెంపు పనులను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలిచ్చారు.

నల్లవాగులో కొట్టుకుపోయిన గొర్రెలు

- 30 జీవాలు మృతి


మృతి చెందిన గొర్రెలను చూపుతున్న బాధితులు

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్ల- వల్లంపాడు గ్రామాల మధ్య సోమవారం ఉప్పొంగిన నల్లవాగు ఉధృతికి గొర్రెలు కొట్టుకుపోయాయి. నైరుతి రుతుపవనాల ప్రభావంతో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌తోపాటు ఎగువ ప్రాంతాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. వంకలు, పొలాల్లోని నీరంతా నల్లవాగులో చేరి వాగుకు వరదనీరు పోటెత్తింది. అనంతపురం జిల్లా యాడికి మండలం గుడిపాడుకు చెందిన రామసుబ్బారెడ్డి, దస్తగిరిరెడ్డికి చెందిన గొర్రెల మందను వాగు దాటిస్తుండగా ఉధృతికి 50 గొర్రెలు కొట్టుకపోయాయి. ఈ ప్రమాదంలో 30 గొర్రెలు మృత్యువాత పడినట్లు బాధితులు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో సోమవారం కుక్కల దాడిలో జింక మృతి చెందింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం కురవటంతో పొలాల్లో ఉన్న జింక రోడ్డుపైకి వచ్చింది. అక్కడే ఉన్న కుక్కల గుంపు జింకను వెంబడించి దాడి చేశాయి. కుక్కల గుంపు జింకను నోటితో పట్టుకొని గ్రామంలోకి వస్తుండటంతో అక్కడ ఉన్న వారు వాటిని తరమివేశారు. అప్పటికే తీవ్ర గాయాలతో జింక మృతి చెందింది. గ్రామస్తులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వటంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన జింకకు పంచనామా నిర్వహించి తమతో తీసుకెళ్లారు.